కృష్ణార్జునుల జనయాత్ర

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు కుడిఎడమల సైన్యం.. పోటాపోటీగా సభలు, రోడ్ షోలతో ప్రజలతో మమేకం.. గులాబీ దండును సమర్థంగా నడిపించిన యువనేతలు

ఎన్నికల కురుక్షేత్రంలో అలనాటి కృష్ణార్జునులను గుర్తు చేశారు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుడి, ఎడమల సైన్యంగా వ్యవహరిస్తూ, క్యాడర్‌లో జోష్ పెంచారు. పార్టీ అభ్యర్థులకు కొండంత అండగా నిలిచారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ఈ ఇద్దరు నేతలు కృష్ణార్జునుల వలె రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాలను చుట్టివచ్చారు. గులాబీ సైన్యాన్ని ఎక్కడిక్కడ సమన్వయం చేసుకుంటూ క్యాడర్‌ను ఉత్సాహపరిచారు. ప్రజల మద్దతును కూడగట్టడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో ఎప్పటికప్పుడు స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విపక్షాల విమర్శలను సమర్థంగా తిప్పికొట్టారు. పార్టీ అధినేత వ్యూహాన్ని అమలు చేయడంలో నూటికి నూరుపాళ్లు శ్రమించారు.

– హైదరాబాద్, నమస్తే తెలంగాణ

కేటీఆర్ సమ్మోహనాస్త్రం

- **60 రోజులు..70 రోడ్‌షోలు.. 30 బహిరంగ సభలు**

మంగళవారం సిరిసిల్ల రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

గత 60 రోజులుగా సాగిన ఎన్నికల ప్రచారంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ సైన్యాన్ని సమర్థంగా నడిపించారు. సీఎం కేసీఆర్ తర్వాత అత్యధిక సభలు, రోడ్ షోలు, ర్యాలీల్లో పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే దాదాపు 30 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల నోటిఫికేషన్ తరువాత స్పీడ్ మరింత పెంచారు. ప్రభుత్వ పనితీరు, పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని సమర్థంగా వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రం నలుమూలలా జరిగిన 30 భారీ బహిరంగసభల్లో పాల్గొన్నారు. తన ప్రసంగాలతో మహిళలు, యువత, విద్యావంతులను ఆలోచింపజేశారు. ఆయన సంధించిన వాక్బాణాలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. అత్యంత కీలకమైన జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచార బాధ్యతను తన భుజాలపై వేసుకున్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో కనీసం రెండు రోడ్ షోలతోపాటు ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి వంటి పెద్ద నియోజకవర్గాల్లో ఒకేరోజు నాలుగు నుంచి ఐదు రోడ్ షోలలో పాల్గొన్నారు.

అన్నివర్గాల సమ్మోహనం

ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాల్లో రోడ్ షోలు నిర్వహించిన కేటీఆర్.. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు హైదరాబాద్‌లో ప్రచారం చేశారు. జయప్రకాశ్ నారాయణ (జేపీ), గోరటి వెంకన్న, ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి వారికి ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువకులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఓలా, ఊబర్, జొమాటో వంటి వాటి ద్వారా సేవలు అందిస్తున్న గిగ్‌వర్కర్లతో ప్రత్యేకంగా సంభాషించి, వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో ఫస్ట్‌టైం ఓటర్లు, ఐటీ ఉద్యోగులు, రియల్‌ఎస్టేట్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, దళిత గిరిజన పారిశ్రామికవేత్తలు, వివిధ వర్గాల ప్రముఖులు, ఉద్యోగులు, ప్రజలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సమాజంలో సగభాగమైన మహిళలతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి గెలిచిన తర్వాత మహిళల కోసం చేపట్టే అనేక కార్యక్రమాలపై తన ఆలోచనలను పంచుకున్నారు. పలు కులసంఘాల నాయకులు, మైనార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకవైపు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు పార్టీ తరపున ఇచ్చే పత్రికా ప్రకటనల నుంచి సామాజిక మాధ్యమాల కోసం రూపొందించాల్సిన కంటెంట్ వరకు విస్తృతంగా చర్చించి దిశా నిర్దేశం చేశారు. మొత్తం 60 రోజుల పార్టీ ప్రచారంలో అత్యంత హుందాగా వ్యవహరించారు. ప్రతిపక్ష పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేసినా, కేవలం పాజిటివ్ అంశాలే ఎన్నికల ఎజెండా కావాలన్న సానుకూల ఆలోచనతో.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దీంతో క్షేత్రస్థాయి నుంచి కేంద్ర పార్టీ కార్యాలయం వరకు పూర్తి సమన్వయంతో ప్రచారపర్వంలో ప్రత్యర్థులకు అందనంత వేగంగా బీఆర్ఎస్ దూసుకెళ్లింది. దీంతోపాటు ప్రతిరోజూ వేలాది మందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా కేటీఆర్ మాట్లాడారు. పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జీలు, వార్‌రూమ్ ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఆయా నియోజకవర్గాల్లోని ఒపీనియన్ మేకర్లు, ముఖ్యమైన వ్యక్తులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సంభాషించి పార్టీ కోసం వారి మద్దతును కూడగట్టారు.

విపక్షాలపై ఎక్కుపెట్టిన బాణం

సాధించిన ప్రగతిని వివరిస్తూనే భవిష్యత్ కార్యాచరణను ప్రజల ముందు ఉంచడంలో కేటీఆర్ సఫలీకృతులయ్యారు. తెలంగాణ ఎవరి చేతిలో ఉంటే పదిలంగా ఉంటుందో ఆలోచించాలని ఆయన చేసిన విజ్ఞప్తి ప్రజలను ఆకట్టుకున్నది. అభివృద్ధి ఎజెండాతో కేటీఆర్ సాగించిన ప్రచార పర్వం సరికొత్త ట్రెండ్ సృష్టించింది. అదే సందర్భంలో ప్రతిపక్షాల డొల్లతనాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు. కర్ణాటక ప్రజలను కాంగ్రెస్ ఏవిధంగా వంచించిందో ఉదాహరణలతో వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ప్రజలకు మరోసారి గుర్తుచేశారు. సమైక్యరాష్ట్రంలో 60 ఏండ్లలో జరగని అభివృద్ధిని తెలంగాణ కేవలం పదేండ్లలోనే సాధించిందని, ఇది విజన్ ఉన్న నాయకత్వం ఉండటం వల్లే సాధ్యమైందని గుర్తుచేశారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉన్నదంటూ కేటీఆర్ చేసిన విజ్ఞప్తి ప్రజల్లో చర్చనీయాంశమైంది.

విరామం ఎరుగని బుల్లెట్ హరీశ్

- **60 సభలు.. మరెన్నో రోడ్‌షోలు**

బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశమే శిరోధార్యంగా, పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మంత్రి హరీశ్‌రావు ఈ ఎన్నికల ప్రచారంలో తనదైన భాగస్వామ్యాన్ని బాధ్యతగా నిర్వర్తించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ప్రచారపర్వంలోకి దిగిన హరీశ్.. 60 నియోజకవర్గాల్లో అలుపెరగకుండా తిరిగారు. ఒకవైపు సీఎం కేసీఆర్‌తో ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొంటూనే మరోవైపు మరికొన్ని బహిరంగ సభలు, రోడ్ షోలకు హాజరయ్యారు. ఆయా జిల్లాల్లో గులాబీ దళంలో ఉత్తేజాన్ని నింపారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ప్రజల్లో ప్రబలమైన విశ్వాసాన్ని పాదుకొల్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. సన్న బియ్యం, రైతుబంధు, రూ.400కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను ప్రజలకు వివరించారు. 'రిస్కు వద్దు.. కారుకే ఓటు గుద్దు' అంటూ హరీశ్‌రావు ఇచ్చిన నినాదాలు ప్రజల్లో మార్మోగాయి. కారు, హెలికాప్టర్ ద్వారా ఆయా జిల్లాల్లో జరిపిన హరీశ్‌రావు పర్యటనలు బీఆర్ఎస్‌ను గెలుపునకు మరింత దగ్గర చేశాయి. రెండు నెలలపాటు ఆయన అవిశ్రాంతంగా రాష్ట్రం అంతటా తిరిగారు. తాను ప్రయాణిస్తున్న సమయంలోనూ నియోజకవర్గాల క్యాడర్‌తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

విపక్షాలపై నిప్పులు

ఒకవైపు ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు, ఆరోపణలను తిప్పికొడుతూ తెలంగాణభవన్, ఇతర జిల్లాల్లో అనేక మీడియా సమావేశాలు నిర్వహించారు. టీవీ చానళ్ల డిబేట్లలో పాల్గొని మూడోసారి బీఆర్ఎస్ సర్కారు ఏర్పాటు అవశ్యకతను తనదైన శైలిలో వివరించారు. కాంగ్రెస్, బీజేపీ చేసే తప్పుడు ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ విజయం గురించి వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, కుల, మత సంఘాలతో హరీశ్‌రావు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. తెలంగాణభవన్ సహా వివిధ జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో హరీశ్‌రావు సమక్షంలో వేల సంఖ్యలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన ప్రముఖ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.

హరీశ్‌రావు పర్యటించిన నియోజకవర్గాలు

అక్టోబర్‌లో మెదక్, తాండూర్, ములుగు, నర్సంపేట, డోర్నకల్, నకిరేకల్, తుంగతుర్తి, మహేశ్వరం, కల్వకుర్తి, దుబ్బాక, గజ్వేల్, మక్తల్, కొడంగల్, దేవరకద్ర, జుక్కల్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, మానకొండూర్, సిద్దిపేట, మంచిర్యాల, చెన్నూరు, జహీరాబాద్, సంగారెడ్డి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్, ఆదిలాబాద్, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల సభల్లో పాల్గొన్నారు. నవంబర్‌లో దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, మెదక్, అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరు, సిద్దిపేట, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్, హుజూరాబాద్, ములుగు, బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి, నారాయణ్‌ఖేడ్, మానకొండూరు, మహబూబాబాద్, నర్సంపేట, పాలకుర్తి, జనగామ, ఆలేరు, భువనగిరి, రాజేంద్రనగర్, కొడంగల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలు, రోడ్ షోల్లో పాల్గొన్నారు.

మంగళవారం చేగుంట రోడ్‌షోలో ప్రసంగిస్తున్న హరీశ్‌రావు

70 ఏండ్ల వయసులో 96 సభలు

32 రోజుల్లో రాష్ట్రాన్ని కలియతిరిగిన కేసీఆర్

సగటున రోజుకు మూడు సభలకు హాజరు.. అన్ని ఎన్నికల సభల్లో సమ్మోహన ప్రసంగం

ప్రజాచైతన్యాన్ని కూడగట్టిన బహుముఖత్వం.. తన రికార్డునే తిరగరాసిన సీఎం

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఒక పూట ప్రయాణం చేస్తేనే అలసిపోతాం. ఒళ్లు హూనం అయ్యిందని గగ్గోలు పెడుతుంటాం. కానీ 70 ఏండ్ల వయసులో రోజుకు మూడు చోట్లకు.. అలా 32 రోజుల పాటు 96 సభల్లో పాల్గొని, ప్రసంగించి, ప్రజలను మెప్పించటం అంటే మాటలా? కానీ కేసీఆర్ సాధ్యం చేసి చూపించారు. అవును! అక్టోబర్ 15న హుస్నాబాద్‌లో మొదలైన ఆయన ప్రజాఆశీర్వాద సభ ప్రసంగాల ఝరి.. మంగళవారం గజ్వేల్‌లో ప్రసంగించే వరకు కొనసాగింది. ఈ ప్రసంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో వివరించారు, ఏం చేస్తుందో తెలియజేశారు, ఓటు ఎంత గొప్పదో వివరిస్తూనే, బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలో చెప్పారు. అదే సమయంలో విపక్షాల కుట్ర కత్తులను కోట్ల గొంతుల కొడవలై తెగ్గోశారు. తొమ్మిదిన్నర ఏండ్ల బీఆర్ఎస్ సర్కారు ప్రగతిని చెప్తూనే, ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేశారు. రైతు వెన్ను ముకను విరిచేందుకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని కండ్లకుకట్టారు. 60 ఏండ్లలో గత ప్రభుత్వాలు చేయని పనులను పదేండ్లలో చేసి చూపిన విధానాన్ని, పాలన విజయాలను వివరిస్తూ ప్రతి మెదడు ఆలోచించేలా చేశారు. తరగతి గదిలో పాఠం చెప్పినట్టు, కుటుంబ పెద్ద మంచి, చెడ్డ వివరించినట్టు ఖుల్లంఖుల్లాగా అన్ని విషయాలను వెల్లడించారు.

కోటి మందితో మమేకం

96 ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్.. దాదాపు కోటి మందికిపైగా ప్రజలతో మమేకమయ్యారు. వారితో నేరుగా మాట్లాడారు. ఈ సభలు ఎంత గొప్పగా సాగాయంటే ఏ సభకు ఆ సభే పోటీ అని అనిపించక మానదు. తన ప్రసంగాలతో ప్రజలను మెప్పించిన ఆయన.. పార్టీ అధినేతగా బీఆర్ఎస్ శ్రేణులను ఎన్నికల సమరంలో ముందుకు నడిపించారు.

కేసీఆర్ అంటే రికార్డులు

2014లో సీఎం కేసీఆర్ 80కిపైగా సభల్లో పాల్గొన్నారు. 2018లో 87 సభల్లో పాల్గొన్నారు. ఈసారి 96 ప్రజా ఆశీర్వాదసభల్లో పాల్గొని తన రికార్డులను తానే బ్రేక్ చేశారు. రోజుకు 3 బహిరంగ సభల చొప్పున 32 రోజులపాటు 96 బహిరంగసభల్లో పాల్గొన్న చరిత్ర దేశంలో మరే రాజకీయ నాయకుడికి లేదు. కేసీఆర్ ఆరోగ్యం సరిగా లేదని, బయటికి రారని విపక్షాలు, గిట్టనివాళ్లు చేసిన ఆరోపణలు ఈ దెబ్బతో పటాపంచలయ్యాయి. మంచి నీళ్లు కూడా తాగకుండా ఏకబిగిన ప్రసంగించి, ఇతర నియోజకవర్గాలకు తిరిగి వెళ్లడం, అదీ కర్ణకఠోరమైన ధ్వని సృష్టించే హెలికాప్టర్‌లో ప్రయాణం అంత సులువు కాదని, అది కేసీఆర్‌కే సాధ్యమైందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఊర్లకు ఊర్లు సభల వైపే

సీఎం కేసీఆర్ పాల్గొన్న ప్రతి సభలో ఇసుకేస్తే రాలనంత జనం హాజరయ్యారు. సభా ప్రాంగణాలు చాలక చుట్టుపక్కల మేడలు, మిద్దెలు, చెట్లు ఎక్కి కేసీఆర్ ప్రసంగాలను విన్నారు. నియోజకవర్గాల్లోని ఊర్లకు ఊర్లు తరలివచ్చాయి. 2014లో 63 స్థానాలు, 2023లో 88 స్థానాలను సొంతం చేసుకున్న బీఆర్ఎస్‌కు ఈసారి అంతకంటే ఎక్కువ సీట్లే వస్తాయని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గత రెండు ఎన్నికల్లో కేసీఆర్ సభలు హుస్నాబాద్‌లో ప్రారంభమై, గజ్వేల్‌తో ముగిసినట్టే, ఈసారి కూడా హుస్నాబాద్‌లోనే ప్రారంభమై, గజ్వేల్‌లో పూర్తయింది.

కేసీఆర్ ఏ రోజు, ఎక్కడెక్కడ పాల్గొన్నారంటే..

- అక్టోబర్ 15, 2023న హుస్నాబాద్
- అక్టోబర్ 16న జనగామ, భువనగిరి
- 17న సిరిసిల్ల, సిద్దిపేట
- 18న జడ్చర్ల, మేడ్చల్
- 26న అచ్చంపేట, వనపర్తి, మునుగోడు
- 27న పాలేరు, మహబూబాబాద్, వర్ధన్నపేట
- 29న కోదాడ, తుంగతుర్తి, ఆలేరు
- 30న జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్
- 31న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ
- నవంబర్ 1న సత్తుపల్లి, ఇల్లందు
- 2న నిర్మల్, బాల్కొండ, ధర్మపురి
- 3న బైంసా (ముథోల్), ఆర్మూర్, కోరుట్ల
- 5న కొత్తగూడెం, ఖమ్మం
- 6న దేవరకొండ, గద్వాల, మక్తల్, నారాయణపేట
- 7న చెన్నూర్, మంథని, పెద్దపల్లి
- 8న సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి
- 9న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో కేసీఆర్ నామినేషన్ దాఖలు, అనంతరం కామారెడ్డిలో ప్రజాఆశీర్వాదసభ
- 13న దమ్మపేట (అశ్వారావుపేట), బూర్గంపాడు (భద్రాచలం, పినపాక నియోజకవర్గాలు), నర్సంపేట
- 14న పాలకుర్తి, హాలియా (నాగార్జునసాగర్), ఇబ్రహీంపట్నం
- 15న బోధన్, నిజామాబాద్, ఎల్లారెడ్డి, మెదక్
- 16న ఆదిలాబాద్, బోథ్, నిజామాబాద్ రూరల్, నర్సాపూర్
- 17న కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, పరకాల
- 18న చేర్యాల (జనగామ)
- 19న అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి
- 20న మానకొండూర్, స్టేషన్ ఘన్‌పూర్, నకిరేకల్, నల్లగొండ
- 21న మధిర, వైరా, దోర్నకల్, సూర్యాపేట
- 22న తాండూరు, కొడంగల్, మహబూబ్‌నగర్, పరిగి
- 23న మహేశ్వరం, వికారాబాద్, జహీరాబాద్, పటాన్‌చెరు
- 24న మంచిర్యాల, రామగుండం, ములుగు, భూపాలపల్లి
- 26న ఖానాపూర్, జగిత్యాల, వేములవాడ, దుబ్బాక
- 27 షాద్‌నగర్, చేవెళ్ల, అందోల్, సంగారెడ్డి
- 28న వరంగల్ (వరంగల్ ఈస్ట్, వరంగల్ పశ్చిమ), గజ్వేల్

ఎమ్మెల్సీ కవిత అలుపెరగని ప్రచారం

- **నెలకుపైగా నిజామాబాద్ లోనే బస**
- **10 నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు**

ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు కూడగట్టడానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అలుపెరగని ప్రచారం చేశారు. నెల రోజులకుపైగా నిజామాబాద్‌లోనే బస చేసి ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. నిజామాబాద్ అర్బన్, బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు బాసటగా నిలిచారు. 70కిపైగా రోడ్ షోలు, పాదయాత్రలు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, బహిరంగ సభల్లో పాల్గొన్నారు. కులసంఘాల సమ్మేళనాలు, యువత, మహిళ, కార్మికుల సమ్మేళనాలలో విస్తృతంగా పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ.. కారు గుర్తుకు ఎందుకు ఓటేయాలో ప్రజలకు అర్థమయ్యే తీరులో చక్కగా వివరించారు. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను సమర్థవంతంగా ఎండగట్టారు. తమ పార్టీపై ప్రతిపక్షాలు చేసే విమర్శలు, ఆరోపణలకు దీటుగా సమాధానాలిచ్చారు. ఎమ్మెల్సీ కవిత పాల్గొన్న సభలు, రోడ్ షోలు, సమావేశాలకు మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలిరావడం గమనార్హం. నేరుగా మహిళల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా కవితకు ఘనస్వాగతం లభించింది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వ్యూహాత్మకంగా వ్యవహరించిన కవిత.. కోరుట్ల టౌన్ బీజేపీ అధ్యక్షుడు, ఇద్దరు కౌన్సిలర్లతోపాటు దాదాపు 200 మంది కార్యకర్తలను పార్టీలో చేర్చుకొని ఆ నియోజకవర్గంలో బీజేపీ ఖాళీ అయిన పరిస్థితికి తీసుకొచ్చారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ పెద్ద సంఖ్యలో యువత కవిత సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

కాంగ్రెస్ కుట్రల వ్యూహం లీక్!

- ***పోలింగ్ వేళ గందరగోళం సృష్టించేందుకు స్ట్రాటజిస్ట్ సునీల్ కనుగోలు ప్లాన్***
- ***సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేసేందుకు స్కెచ్***
- ***కుట్రలను తిప్పికొడుతున్న మిషన్ తెలంగాణ***

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): పోలింగ్ గడువు దగ్గర పడుతున్న కొద్దీ కాంగ్రెస్ కొత్త కుట్రలకు తెరలేపుతున్నది. ఫేక్ సర్వేలు, పెయిడ్ కథనాలతో లేని బలం ఉన్నట్టు ప్రచారం చేసుకొంటున్న ఆ పార్టీ నేతలు.. పోలింగ్ వేళ ఓటర్లను అయోమయానికి గురిచేసే ప్రణాళికలను రచిస్తున్నారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌పై, సీఎం కేసీఆర్, వారి కుటుంబ సభ్యులపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయాలని ఆ పార్టీ ఎలక్షన్ స్ట్రాటజిస్ట్ సునీల్ కనుగోలు పన్నిన వ్యూహం బహిర్గతమైంది. కాంగ్రెస్ పార్టీ అసలు రంగు బయటపడింది. ఎన్నికల ప్రకటన విడుదలైనప్పటి నుంచి బీఆర్ఎస్‌పై అసత్య కథనాలను సృష్టించి, ప్రచారం చేస్తున్న ఈ బృందం పోలింగ్ వేళ మరిన్ని కుట్రలకు సునీల్ కార్యాలయాన్ని అడ్డగా ఉపయోగిస్తున్నది.

పోలింగ్ సందర్భంగా ప్రజల్లో పెద్ద ఎత్తున భయాందోళనలు సృష్టించడం ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం రాబోయే 48 గంటల్లో బీఆర్ఎస్‌పై తప్పుడు కథనాలను వ్యాప్తి చేసేందుకు ప్రణాళిక చేసింది. ప్రణాళికలో భాగంగా బీఆర్ఎస్ ఓడిపోతున్నదని, త్వరలో ఆ పార్టీ ఎన్డీఏలో చేరుతుందని ప్రచారం చేయాలని చూస్తున్నది. ఎమ్మెల్సీ కవిత ఎంపీగా గెలిచి, కేంద్ర మంత్రి అవుతారంటూ తప్పుడు కథనాలను సృష్టించేందుకు సిద్ధమైంది. ఎన్నికల్లో ఓడిపోతారని గుర్తించిన సీఎం కేసీఆర్ కుటుంబం ఫామ్‌హౌజ్‌లో స్కామ్‌లకు సంబంధించిన అన్ని సాక్ష్యాలను తగులబెడ్తున్నదనే తప్పుడు వార్తలను విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సునీల్ బృందం సూచించినట్టు సమాచారం. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రతి ఎమ్మెల్యేకు రూ.100 కోట్లు కేసీఆర్ పంపారని, ఓటుకు రూ.10 వేలు పంచుతున్నట్టు పెద్ద ఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేయాలని, బీఆర్ఎస్ ఇచ్చే డబ్బులు తీసుకొని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అడిగేందుకు ఐవీఆర్ఎస్ కాల్‌లను కూడా సిద్ధం చేసినట్టు తెలిసింది. సానుభూతితో ఓట్లను పొందేందుకు వీలుగా రెండురోజులు న్యూస్ పేపర్లలో మొదటి పేజీ, జిల్లా సంచికల్లో సోనియా గాంధీ రాసిన లేఖను ప్రచారం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

'మిషన్ తెలంగాణ' అలర్ట్

సునీల్ కనుగోలు బృందం రచించిన కుట్ర సమాచారం లీక్‌కావడంతో 'మిషన్ తెలంగాణ' అప్రమత్తమైంది. సునీల్ కనుగోలు బృందం చేసే కుట్రలు, తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడంతోపాటు వాస్తవాలతో తెలంగాణ ప్రజలను చైతన్యం చేస్తున్నది. కొంతమంది చేస్తున్న ఇలాంటి ఎత్తుగడలు, ఈ దుష్ప్రచారాలను నమ్మవద్దని మిషన్ తెలంగాణ సూచిస్తున్నది. బీఆర్ఎస్, పార్టీ నాయకులపై కొన్ని పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, ఇలాంటి కుట్రలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని ట్విట్టర్ వేదికగా సూచించింది. రెచ్చగొట్టే వార్తలు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఏదైనా సమాచారాన్ని తెలుసుకొనేందుకు బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా, అధికారిక వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించింది. ఇతర పార్టీలు సృష్టిస్తున్న అభూత కల్పనలు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని, బీఆర్ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు అండగా ఉండాలని 'మిషన్ తెలంగాణ' పిలుపునిచ్చింది.

కాంగ్రెస్ ఓటేస్తే.. పథకాలకు పాతర!

అది మే 20, 2023. శనివారం. కర్ణాటక సీఎంగా సిద్ధరామయ్య ప్రమాణం చేశారు. మరునటి రోజు ఆదివారం. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. సోమవారం నాడు.. సీఎంలో కార్యాలయం నుంచి ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయి. గత ప్రభుత్వం ప్రకటించిన స్కీంలు, ప్రాజెక్టులకు నిధులు నిలిపేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే గత ప్రభుత్వ పథకాలను రద్దు చేసిన కాంగ్రెస్ చరిత్ర ఇది. నరే, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలనైనా అమలు చేసిందా? అంటే, అదీ లేదు. దీంతో.. కాంగ్రెస్‌కు ఓటేసి గత ప్రభుత్వ స్కీంలకు దూరమయ్యామని, కాంగ్రెస్ 5 గ్యారంటీలు కూడా అమలు కావట్లేదని కర్ణాటక ప్రజలు లబోదిబోమంటున్నారు. రెంటికీ చెడ్డ రేవడిగా తమ పరిస్థితి మారిపోయిందంటూ వాపోతున్నారు.

ఇప్పుడు, అదే పొరపాటు తెలంగాణ ప్రజలు చేస్తే, సంక్షేమ పథకాలన్నీ పోతయ్. జాగ్రత్త!!

- **కర్ణాటకలో అధికారంలోకి రాగానే, గత స్కీంలకు నిధులు నిల్పేసిన హస్తం**
- **5 గ్యారెంటీల అమల్లోనూ అట్టర్‌ఫ్లాప్**
- **కాంగ్రెస్‌కు ఓటేసి రెంటికీ చెడ్డ రేవడిగా మిగిలామంటూ కన్నడ ప్రజల ఆవేదన**
- **ఆదమరిస్తే తెలంగాణకు ఇదే గతి**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఇలాంటి వాటిపై చిత్తశుద్ధి ఏమీ ఉండదు. కావాల్సింది ఒక్కటే క్రెడిట్. దీనికోసం ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు. ఇదీ కాంగ్రెస్ వైఖరి. పొరుగు రాష్ట్రం కర్ణాటకనే దీనికి తాజా ఉదాహరణ. ఆరు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. గత ప్రభుత్వహయాంలో అమలుచేసిన పథకాలకు, ప్రారంభించిన ప్రాజెక్టులకు, బోర్డులు, కార్పొరేషన్లకు నిధుల విడుదలను నిలిపేసింది. సీఎంగా సిద్ధరామయ్య పగ్గాలు చేపట్టిన వెంటనే మొట్టమొదటగా జారీచేసిన ఆదేశాలు అవే. దీంతో రైతుసాయం కింద గత ప్రభుత్వం అందించిన రూ. 4 వేలు, అన్నదాతలు, వారి కుటుంబ సంక్షేమం కోసం తీసుకొచ్చిన రైతు విద్యానిధి, భూ సిరి, జీవనజ్యోతి తదితర పథకాలు నిలిచిపోయాయని కన్నడ ప్రజలు మండిపడుతున్నారు. కృష్ణ, మహాదయాయి, కావేరీ బేసిన్‌లో ప్రారంభించిన పలు ప్రాజెక్టులకు, బెంగళూరు సబర్బన్ రైలు ప్రాజెక్టు, మెట్రో రైల్ ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను నిలిపేసిందని కర్ణాటక మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై ఆగ్రహం వ